# స్నే...హితం

-గోవిందరాజు సీతాదేవి

సాయంకాలం ఆరుగంటలు దాటింది.

ఆఫీసు నించి అలసిపోయి ఇల్లు చేరుకున్న నాకు 'ఫ్లాట్' తాళం తెరిచి లోపలికి వెడుతుంటే వాచ్‌మేన్ వచ్చి "అమ్మా మీకు ఉత్తరం" అంటూ అందించి వెళ్ళిపోయాడు.

కవరు తిప్పి 'ఫ్రం' అడ్రస్ చూశాను. అది అమ్మ రాసిన ఉత్తరం. అమ్మరాసిన ఉత్తరం అంటేనే విషయం క్షణంలో అర్ధమైపోతుంది. "అమలా నువ్వక్కడ క్షేమంగా వున్నావు కదూ తల్లీ, ఇక్కడ నేను క్షేమమే. నీకో ముఖ్య విషయం ఏమిటంటే మామయ్య నీకో మంచి సంబంధం చూశాడు. వెంటనే శలవు పెట్టిరా. యిప్పటికే నీకు ముప్ఫై ఏళ్ళు దాటాయి. నాన్న పోవటంతో తమ్ముడి చదువూ చెల్లి పెళ్ళీ అంటూ బాధ్యతలు పడటంతో నిజంగానే నీకు పెళ్ళి ఆలస్యం అయింది. యిప్పుడా బాధ్యతలని తీర్చుకున్నావు కనుక యెవరినో ఒకరిని పెళ్ళి చేసుకుని నువ్వు సుఖంగా వున్నావంటే యెనభై యేళ్ళ యీ వయసులో ప్రశాంతంగా కన్ను మూస్తాను.

యిదిగో వరుడి వివరాలు అంటూ మరో కాయితం పెట్టింది అందులో. వరుడికి వయసు ముప్ఫై ఆరు. అతనూ తండ్రి పోవటంతో తల్లీ, చెల్లెలూ, తమ్ముడి బాధ్యతలు నెత్తిన వేసుకుని వారినోదారి చేసి యిప్పుడు యింక 'ఓ ఇంటి' వాడు కావాలన్న ప్రయత్నంలో వున్నాడుట. అతని ఫొటో కూడా చూశాం. అబ్బాయి బానే వున్నాడు. ఉద్యోగం కూడా మంచిదే. కనుక వెంటనే వచ్చేయి. నీ కోసం మామయ్యా నేనూ ఎదురు చూస్తుంటాం. నీకు వీలు కాదంటే అతనే వస్తానని చెప్పాడు. నీ అడ్రసూ, ఫోన్ నెంబరూ యిచ్చా.

ఇట్లు

అమ్మ

ఉత్తరం పూర్తిగా చదివి టేబుల్ మీద పడేసి స్నానం చేసి కాఫీ తాగుతూ మంచంమీద కూర్చున్నాను. అమ్మ రాసిన ఉత్తరంలో వరుడి వివరాలు బానే వున్నాయి. నాకు పెళ్ళి కావల్సిన వయసులో పరిస్థితులు అడ్డువచ్చి పెళ్ళి వాయిదా వేయవల్సి వచ్చింది. ఆ బాధ్యతల బరువు తీరిన తర్వాత జీవితాన్ని ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే అతి విలువైన పదేళ్ళ కాలం గడిచిపోయింది. ఆ పదేళ్ళ కాలంలోని ఒక్క క్షణాన్ని కూడా తిరిగి తీసుకురాగల శక్తి లేదు. ఆ కాలంలో ప్రేమించి ప్రేమించబడిన అశోక్ 'అమలా మన యిద్దరి పరిస్థితీ ఒక్కలానే వుంది. నీలానే అమ్మా, తమ్ముడూ, చెల్లీ నా మీద ఆధారపడి వున్నారు. అయినా మనిద్దరం పెళ్ళి చేసుకుందాం. ఇద్దరి బాధ్యతలనీ ఇద్దరం కలసి పంచుకుందాం అమలా" అని యెన్నో విధాల చెప్పాడు. అది నా కిష్టం అన్పించలేదు. అప్పుడు అతని తల్లీ, చెల్లీ, తమ్ముడూ అనే సమస్య నన్ను భయపెట్టి మనసు సరైన నిర్ణయం చేసింది అనుకుని 'నో' అని చెప్పాను. తర్వాత అశోక్ మరో అమ్మాయిని పెళ్ళాడుతూ శుభలేఖ యిచ్చినప్పుడు ఆ పెళ్ళికి వెళ్ళి పెళ్ళికూతురి తలమీద అక్షింతలు వేస్తూ, పాపం 'నీ జీవితంలో యేం సుఖపడగలవో అమ్మా' అనుకున్నాను. కానీ మరో యేడాదికి తెల్సింది. నేను ఆలోచించినది తప్పని. అశోక్ నీరజా అన్యోన్యంగా జీవితం సాగిస్తూ శాంతిగా బ్రతుకుతున్నారని.

మనుషులు శాంతిగా, సుఖంగా బ్రతకటానికి కారణం పరిస్థితులు కారణం కాదని, వారి వారి ఆలోచనా విధానం అనీ ఆలస్యంగా తెలుసుకున్నాను. ఆఫీసు, ఇల్లూ, ఒంటి బ్రతుకూ అప్పుడప్పుడూ విసుగు కల్గిస్తున్నా రోజులు గడిచిపోతూనే వున్నాయి.

అమ్మ రాసిన ఉత్తరంలోని విషయం గురించి ఆలోచించాలి. వెళ్ళటానికి శలవులేదు. అనుకుంటూ భోజనం కానిచ్చి నిద్రలోకి జారిపోయాను.

2

తెల్లవారింది. ఆదివారం కావటం వల్ల ఆఫీసుకి శలవు. ఆలస్యంగా లేచి కాఫీ తాగుతుండగా కాలింగ్ బెల్ మోగింది.

'యిప్పుడెవరూ' ఆలోచిస్తూ వెళ్ళి తలుపు తెరిచాను.

వసుంధర. చిన్ననాటి ప్రాణ స్నేహితురాలు. ప్రయాణం చేసి వచ్చిన బడలిక ముఖంలో కన్పిస్తుండగా సూట్‌కేస్‌తో నిలబడి వుంది.

"అలా... ఏమిటీ హఠాత్తుగా రావటం. శేఖర్ కూడా వున్నాడా వెనక" వసుంధర చేతిలోని సూట్‌కేస్ అందుకుంటూ అడిగాను.

"ఒక్కదాన్నే వచ్చాను" అంటూ వసుంధర లోపలికి వచ్చింది.

వసుంధరకి సంవత్సరం క్రితం శేఖర్‌తో ఘనంగా పెళ్ళి జరిగింది.

హనీమూన్ అంటూ బెంగుళూర్, తిరుపతీ అటూ ఇటూ తిరిగి ఇల్లు చేరి బానే వున్నారు అని తెల్సింది. అంతే తర్వాత వసుంధర యెప్పుడూ ఉత్తరాలు రాయలేదు. నేనూ నా ఆఫీసు పనుల్లో మునిగిపోయాను. కానీ యివాళ హఠాత్తుగా వసుంధర రావటం కాస్త ఆశ్చర్యం, కాస్త కుతూహలం కల్గించినా పైకి

"ముఖం కడుక్కో కాఫీ తెస్తాను" అన్నాను.

పది నిమిషాల్లోనే వసుంధర టవలుతో ముఖం తుడుచుకుంటూ వచ్చింది.

"అమలా, పెళ్ళి కాకుంటే ఫర్లేదు గానీ హాయిగా శాంతిగా, స్వేచ్ఛగా బ్రతుకుతున్నావే. నిన్ను చూస్తుంటే నాకు అసూయగా వుంది" అంది.

"పెళ్ళి చేసుకుని నువ్వు పడుతున్న కష్టం యేమిటో కాస్త చెప్పు" కుతూహలంగా అన్నాను.

"కష్టం, నష్టం బోలెడంత వుంది" ముఖం దిగులుగా మార్చి అంది.

"క్లుప్తంగా చెప్పు. వింటాను."

"ఆయనకి విడాకులు ఇచ్చేయాలని అనుకుంటున్నాను"

ఈ మాటకి నేను ఆశ్చర్యపోలేదు. ఎందుకుంటే వసుంధర మనస్తత్వం చిన్నప్పటి నుంచీ తెల్సు. ప్రతి చిన్న విషయాన్నీ గంపంత చేసి సానుభూతిని ఆశిస్తూ ఇంట్లో తల్లిదండ్రులకి శాంతి లేకుండా చేస్తూ హఠాన్ని ప్రదర్శించటం అలవాటు. అందుకే నేను మెల్లగా" చెప్పు ఎందుకీ నిర్ణయానికి వచ్చావ్?" అన్నాను.

"శేఖర్‌ని పెళ్ళి చేసుకుని కాపురం పెట్టామా. ఒక్కరోజు కూడా శాంతిగా బ్రతకలేదు నేను" కన్నీళ్ళు తుడుచుకుంటూ అంది.

"ఎందుకనీ!!" శేఖర్ మంచివాడు కాడా! దురలవాట్లు వున్నాయా?

గర్ల్ ఫ్రెండ్స్ వున్నారా?

"అబ్బే అవేం లేవు"

"మరి అతనిలోని చెడ్డగుణం ఏమిటి?"

"అతను చేసేవన్నీ నాకు నచ్చని పనులే"

"ఏమిటవి?"

"వృద్ధులైన వాళ్ళ అమ్మానాన్నలని మా దగ్గరకి తీసుకు వస్తానంటాడు. తమ్ముడి చదువుకి డబ్బు పంపిస్తానంటాడు?"

"యింకా?"

"చెల్లెలికి ఓ మంచి సంబంధం చూసి లక్ష కట్నం యిచ్చి పెళ్ళి చేస్తాను అంటాడు"

"శేఖర్ తన సంపాదనలోంచి డబ్బు ఖర్చు చేస్తానంటున్నాడా చెల్లి పెళ్ళికి"

"కాదు, వాళ్ళ అమ్మకి పుట్టింటి వారు పసుపూ కుంకం కింద యిచ్చిన యెకరం మాగాణి పొలం అమ్మేస్తానంటాడు.

"అంతేకదా! అది అమ్మితే నీకేం నష్టం?" అర్ధంకాక అడిగాను.

"పిచ్చిముఖమా, నష్టం నాకు కాక మరెవరికి. ఆ పొలం అమ్మకుండా వుంటే రేపు నాకు పుట్టబోయే పిల్లలకే కదా వచ్చేది"

"బానే వుంది నీ ఆలోచన. పుట్టబోయే నీ పిల్లల విషయం అలా వుంచు. ముందు పెళ్ళికి యెదిగి కూర్చున్న శేఖర్ చెల్లి పెళ్ళి యెలా చేయాలో కాస్త ఉపాయం" నా మాట పూర్తిగా వినకుండానే "ఆ సమస్య నాది కాదు" అంది

భర్త తల్లిదండ్రుల ఆస్తి మీద హక్కు గురించి. తెల్సు కానీ ఆడబడుచు పెళ్ళి చేయాలన్న బాధ్యత అక్కరలేదు. ఈ దేశంలో యిలాంటి మనస్తత్వం వున్న ఆడవాళ్ళు కోకొల్లలుగా కనిపిస్తుంటారు. అందులో ఒకర్తి ఈ వసుంధర. వట్టి స్వార్ధపరురాలు।। లోలోపల అనుకున్నాను.

"నీ ఆలోచనలన్నీ శేఖర్‌కి చెప్పావా?" అడిగాను.

"చెప్పాను. వినలేదు. ఏడిచాను. ఉపవాసాలు చేశాను. పుట్టింటికి పోతానని బెదిరించాను. అయినా

అతను లొంగలేదు. అందుకే విడాకులిచ్చేస్తా అని వచ్చేశాను"

"ఊ తర్వాత" అన్నాను పరమ శాంతంగా.

"ఏంలేదు లాయర్‌ని కలుద్దాం" కాస్త ఆశాభావంగా అంది.

నా మనసులో యెన్నెన్నో ఆలోచనలు చెలరేగుతున్నాయి.

"నీ పెళ్ళికి మీ నాన్న దగ్గర డబ్బులేకుంటే మీ అన్నయ్య బ్యాంకులో లోను తీసుకుని యాభైవేలు యిచ్చాడు కదూ"

"ఇచ్చాడులే బోడి యాభైవేలు. మా వదిన రాక్షసి, రాకాసి. అసూయాపరురాలు, దరిద్రపు బుద్ధులే అన్నీ"

"అలాగా, అవునూ మీ అమ్మ, నాన్న మీ అన్నయ్య దగ్గరే వున్నారు కదూ"

"ఔను వున్నారు. వుంటారు. వాళ్ళకి కొడుకు దగ్గర వుండే హక్కు వుంది."

"పండుగలకి నువ్వూ, శేఖరూ వెళ్ళి వస్తుంటారు కదూ?"

"వూ, వెళ్ళి వస్తాం. అలా వెళ్ళినప్పుడు నాకో బోడి చీరా, ఆయనకో చవకబారు పాంటు, షర్టు పెడతారు. అంతే. అల్లుడికి ఘనంగా యేదైనా స్కూటరో, టీవీనో కొనివ్వాలన్న బుద్ధి కాస్త కూడా లేదు. ఒట్టి పిసినార్లు"

వసుంధర కళ్ళ నుంచి నీళ్ళు జలజలారాలాయి.

నాకు దాన్ని చూస్తే జాలి వెయ్యలేదు. తను చేస్తున్నది న్యాయమా? ధర్మమా అన్న ఆలోచన వుండదు. తనకి ఒకనీతి. యెదటి వాళ్ళ విషయంలో మరో నీతి. ఏం మనిషి. ఏం ఆలోచన వసుంధరది అనుకున్నాను. కానీ పైకి యేం అనలేదు.

2

నాలుగు రోజులు గడిచిపోయాయి. వసుంధర హాయిగా తింటూ సినిమాలు చూస్తూ, టీవీ సీరియల్స్ చూస్తూ కాలం గడిపేస్తోంది "లాయర్ దగ్గరకు పోవాలి" అంది.

లాయరు దగ్గరికి తీసుకువెళ్ళాను. ఆయన వసుంధర చెప్పినదంతా నిశ్శబ్దంగా విన్నాడు. తర్వాత శేఖరుగారిని కూడా పిలిపించండి. యిద్దరికీ నచ్చచెప్పి సంసారం సానుకూలపడేలా ప్రయత్నిద్దాం అన్నాడు నాతో, వసుంధర వినకుండా.

శేఖర్‌తో ఫోనులో మాట్లాడాను. అతని బాధ అతను చెప్పి

"విడాకులివ్వటం నాకు ఇష్టంలేదు అమలగారూ సారీ " అన్నాడు.

"మరేం ఫర్లేదు. కానీ మీరు ఒక్కసారి యిక్కడికి రండి. విషయం యెలా పరిష్కరించుకోవాలో ఆలోచిద్దాం" అన్నాను.

.శేఖర్ వచ్చాడు. సరాసరి లాయరుగారి దగ్గరకి.

లాయరు తేలిగ్గా "విడాకులు అంటూ కోర్టుకెళ్ళడం అనవసరం. ఇద్దరూ యిష్టపడుతున్నారు కనుక ఒకరి కొకరు లెటర్లు యిచ్చేసుకుంటే బాగుంటుంది అని నా సలహా" అన్నాడు.

శేఖర్ వసుంధరా అలాగే అని ఒప్పుకున్నారు.

నాకు నెలకి యెనిమిదివేలు యివ్వాలంటూ పట్టుబట్టింది వసుంధర.

"అలాగే" అని ఒప్పుకున్నాడు శేఖర్. యింక మిగతా తతంగం అంతా లాయరుగారు పూర్తి చేసేశారు.

వసుంధర తనే గెలిచానన్నట్లు తల యెగరేస్తూ గర్వంగా నవ్వింది.

ఇల్లు చేరాం. శేఖర్ కూడా మాతోనే ఇంటికి వచ్చాడు.

నేను మెల్లగా వసుంధర దగ్గరకెళ్ళి కూర్చుని ప్రేమగా భుజంమీద చెయ్యివేసి "వసుంధరా నేను పెళ్ళి చేసుకోబోతున్నాను. యివాళ, యిప్పుడే. వెళ్ళి రిజిస్ట్రాఫీసులో పేర్లు యిచ్చి వస్తాను. ఒక నెలలో పెళ్ళి జరిగిపోతుంది" అన్నాను.

"నిజంగా. నువ్వు పెళ్ళి చేసుకుంటావా చాలా సంతోషం. యింతకీ వరుడెవరు? నాకు చూపించవూ" అంది.

"వరుడు నీ యెదురుగానే వున్నాడు" అన్నాను లో గొంతుతో

"నా ఎదురుగా యెవరే. యెక్కడే" గాభరాగా అంది.

"నువ్వు ఒద్దు అని వదిలేసిన శేఖర్‌ని నేను పెళ్ళాడబోతున్నాను"

శాంత స్వరంతో అన్నాను.



వసుంధర పక్కన బాంబు పేలినంతగా "వామ్మో, వామ్మో ఎంత మోసం. నా మొగుడిని నువ్వు చేసుకుంటావా. నీకెంత ధైర్యమే" అంటూ నన్ను ఒక్క గుంజు గుంజింది.

"ఔను నువ్వు వదిలేసిన శేఖర్‌నే నేను పెళ్ళి చేసుకుంటాను"

వసుంధర అపర కాళిలా లేచింది. నా రెండు రెక్కలూ విరిగిపోతాయేమో అన్నంత గట్టిగా పట్టుకుంది.

"నువ్వు... నువ్వు నా స్నేహితురాలివా? ఒకసారి నువ్వే చెప్పావు. "స్నేహితులు" అంటే "హితం" కోరేవారనీ అలాంటి వాళ్ళే అసలైన "స్నే...హితు"లనీ. కానీ నువ్వు యివాళ చేస్తున్నది ఏమిటే దుర్మార్గురాలా. నేను ఏదో కోపంలో నా భర్తకి విడాకులు యిస్తే యింక నువ్వు పెళ్ళి చేసుకోవటమే. యిదిగో విడాకుల ఉత్తరం చించి పోగులు పెట్టేస్తున్నాను. చెప్పు యిప్పుడు చెప్పు. శేఖర్‌ని పెళ్ళి చేసుకుంటావా!? అంటున్న వసుంధరని శేఖర్ అమాంతంగా వచ్చి నన్ను వదిలించాడు."ఛీ.. ఛీ... యింత జరిగినా నీకు యింకా బుద్ధి రాలేదం'ది. 'నువ్వు మనిషివి కావు' అంటున్న శేఖర్‌ని అమాంతం పట్టుకుని ఏడుస్తూ "నన్ను క్షమించండి. నాకు బుద్ధి వచ్చింది. మీరు చెప్పినట్లే వింటాను. మీ వెంట ఇంటికి వచ్చేస్తాను. ఈ దుర్మార్గురాలిని నమ్మకండి. మీరు దాన్ని పెళ్ళి చేసుకోకండి అంటూ భర్తని ప్రాధేయపడుతున్న వసుంధరని చూస్తుంటే నాకు నవ్వాగలేదు. బిగ్గరగా నవ్వేశాను. శేఖర్ నా నవ్వుతో శృతి కలిపాడు. వసుంధర అయోమయంగా మా యిద్దరివైపూ చూడసాగింది.

'యింక మనం ఆడిన నాటకం చాలు శేఖర్' అని "వసుంధరా! నేను నీ భర్తని పెళ్ళి చేసుకోవడమేమిటి' అదంతా నీకు బుద్ధి రావాలని ఆడిన నాటకం. అదిగో నాకు నచ్చిన, నేను మెచ్చిన పెళ్ళికొడుకు అనిల్. అమ్మ, మామయ్య నా కోసం వెతికి నా అడ్రస్, ఫోన్ నెంబరూ యిచ్చి పంపిన పెళ్ళికొడుకు.

"అతనితోనే నా రిజిస్టర్ పెళ్ళి మరో నెలలో"

అంటూండగా అనిల్ లోపలికి వచ్చాడు. శేఖర్‌నీ, వసుంధరనీ పరిచయం చేశాను.

వసుంధర దగ్గరగా వచ్చి రెండు చేతులూ పట్టుకుంది.

"హితం" కోరేవారే స్నే... హితులు అనే నీ మాటని సార్థకం చేసుకున్నావే. నిన్ను అపార్థం చేసుకుని కటువుగా ఏవేవో అన్నాను. నన్ను క్షమించు. అంటూ కాళ్ళు పట్టుకోబోయింది.

"ఆగు.. ఆగు" అంటున్న నాతో అనిల్ "త్వరగా రండి అమలగారూ. రిజిస్ట్రాఫీసుకి వెడదాం" అనటంతో చప్పున అతనితో వెళ్ళిపోయాను.

❀

## సిటీ బస్సోపాఖ్యానం

సిటీ బస్సు ఎక్కేముందు
బాగానే వుంటుంది మన స్ట్రక్చర్...!
ఎటొచ్చీ దిగేముందే
అవసరముంటుంది మనకో స్ట్రెచర్...!!

- భమిడిపాటి